క్లుప్తంగా

సమావేశాలకు పేరెంట్స్‌ను భాగస్వాములను చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో నీలకంఠం

రామాయంపేట(మెదక్): పాఠశాలల్లో జరిగే సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని రామాయంపేట మండల విద్యాధికారి నీలకంఠం సూచించారు. బుధవారం మండలంలోని అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నెలా విద్యార్థులకు నిర్వహిస్తున్న నెలవారీ మాస పరీక్షల వివరాలు వారి తల్లిదండ్రులకు తెలుపాలన్నారు. లక్ష్మాపూర్, అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం రమాదేవి, పద్మజ, రిసోర్స్ పర్సన్ వీరేశం, ఆర్పీ విజయ, రామాయంపేట, నిజాంపేట, నార్సింగి మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివస్వాముల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో పలువురు భక్తులు కార్తీకమాసంలో శివమాల ధరించారు. రోజూ శివ లింగానికి భక్తిశ్రద్ధలతో శివనామ జపం చేస్తూ ప్రత్యేక పూజలు చేశారు. మాల విరమణ కోసం ఎనిమిది మంది శివ స్వాములు బుధవారం శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో గురుస్వామి శివకుమార్, స్వాములు చక్రపాణి, నాని తదితరులు ఉన్నారు.

నర్సరీల్లో పనులు వేగవంతం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో నర్సరీల్లో పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. బుధవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీల్లో కవర్లలో మట్టి మాత్రమే నింపారని, త్వరగా విత్తనాలు తెప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రమేశ్, ఏపీఓ శ్యాంకుమార్, ఈసీ భగవాన్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బుచ్చానాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పాఠశాల గదులను పరిశీలించి మన ఊరు – మనబడి కార్యక్రమంలో చేపట్టిన మరమ్మతు పనులు హెచ్‌ఎం వెంకటేశం, కాంట్రాక్టర్ కాంతారావును అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వరా?

చిన్నశంకరంపేట(మెదక్): నెలలో సగం రోజులు గడిస్తున్నా ఉపాధ్యాయులకు వేతనాలు ఇంకెప్పుడిస్తారని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు వేతనాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కేసీఆర్‌కు పరామర్శ



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న అనిల్‌కుమార్

నర్సాపూర్: మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నానని చెప్పారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

పెద్దశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్యదర్శులు నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల మండలాధ్యక్షుడిగా చక్రధర్, కార్యదర్శులుగా సవిత, మహిపాల్, గౌరవాధ్యక్షుడిగా వెంకట్రాములు, మహిళా అధ్యక్షురాలిగా స్వరూప, ఉపాధ్యక్షులుగా గీత, రాజాగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వినోద్, కోశాధికారిగా అజ్మత్, సహాయ కార్యదర్శిగా అరవింద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఎంపీఓ విఠల్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

ముస్తాబైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



లక్ష్మీనర్సింహస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 17 నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. దీంతో స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అఖండ దీపారాధన చేసేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. సంక్రాంతి పండగ నుంచి సట్టిడు వారాలు (ఉగాది) వరకు జాతర జగురుతుంది.

తరలిరానున్న భక్తజనం

ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా భక్తులు హైదరాబాద్, రంగారెడ్డి, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని వంటావార్పు చేపడుతారు. పచ్చని లోగిల్లలో కొలువైన లక్ష్మీనర్సింహ్మస్వామి మహిమగల దేవుడని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

పాలక మండలి ఏర్పాటు చేయాలి

దేవాదాయ శాఖ అధినంలో ఆలయం ఉన్నప్పటికీ పదేళ్లుగా పాలకమండలిని నియామకం చేయ్యలేదు. జాతర సందర్భంగా ప్రతీ ఆదివారం వేలాది మంది భక్తజనం తరలిరానున్నందున ఈసారైన కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలకమండలిని నియామకం చేయాల్సిన అవసరం ఉంది.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

జాతరకు వచ్చే వేలాది మంది భక్తజనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంది. ముఖ్యంగా తాగు నీటి ఇబ్బందులు, వైద్య, పోలీస్ శాఖల సహకారంతో శిబిరాలు ఏర్పాటు చేయాలి.

అఖండ దీపారాధన



డిసెంబర్ 17 నుంచి ధనుర్మాసంతో జాతర ప్రారంభమవుతుంది. స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతీ ఆదివారం ఉత్సవాలను కన్నుల పండువగా చేసేందుకు భక్తుల సహకారం ఎంతో అవసరం.

– ధనుంజయ్యశర్మ, ప్రధాన అర్చకుడు

ఏర్పాట్లు పూర్తి



జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సదుపాయాలతో పాటు వైద్య శిబిరం, వలంటీర్లతో భక్తులకు దర్శన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. జాతర మహోత్సవానికి వేలాదిగా వచ్చే భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.

– శశిధర్‌గుప్తా, ఆలయ ఈఓ

మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలపాలి



శివ్వంపేటలో ఉప తహసీల్దార్‌కు వినతిప్రతం ఇస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులు బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్‌కి వినతిపత్రం అందజేశారు. హైదరాబాదుకు దగ్గరగా ఉన్న మెదక్‌ని సిరిసిల్ల జోన్‌లో ఉంచడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీవ్రంగా నష్టపోతున్నామని విద్యార్థులు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో భాగంగా నర్సాపూర్‌లో ఇచ్చిన హామీ ప్రకారం మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ కలపాలని కోరారు.

పాపన్నపేట(మెదక్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని టీపీటీఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ హీరాలాల్ డిమాండ్ చేశారు. బుధవారం పాపన్నపేట, టేక్మాల్ మండల గణిత శాస్త్ర ఉపాధ్యాయులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సంజీవయ్య, సిద్ధిరాములు, భవానీ ఆకాశ్, శివ, వినయ్, రజిత, పద్మ, జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.

ఈజీఎస్ పనులు సక్రమంగా చేపట్టాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా గ్రామ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, గ్రామ కార్యదర్శులకు ఈజీఎస్ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహించొద్దని, నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హద్దురాళ్లు తొలగించిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): మండల విలేకర్లకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో పాతిన సిమెంట్ పోల్స్ (హద్దు రాళ్లు) తొలగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 19 సెకండ్ సీరియల్‌లో శివ్వంపేట మండల విలేకర్లకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. ఆ భూమిలో పాతిన సిమెంట్ పోల్స్‌ని దొంతి గ్రామానికి చెందిన మంగమ్మ సత్తయ్య దంపతులు మంగళవారం తొలగించారన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌చారి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వివాహిత మృతిపై అనుమానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి గ్రామానికి చెందిన మాటూరి భవాని(26) ఆత్మహత్య కాదని ఆడపడుచు, ఆడపడుచు భర్తపై అనుమానం ఉందని తండ్రి రంగిలాల్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం భవాని పొలం వద్ద పురుగుల మందు సేవించి మృతి చెందిన విషయం విధితమే. కాగా ఈవిషయమై మృతురాలి తల్లిదండులు, బంధువులు కౌడిపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూతురు పేరున ఉన్న ఆస్తి కోసమే ఆడపడుచు సరిత, ఆమె భర్త రాజు ఏమైన చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమైన ఏఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతురాలి అంత్యక్రియలు నిర్వహించారు.

అయ్యప్ప పడిపూజ మహోత్సవం



శబరిమలకు వెళ్తున్న స్వాములు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి వజ్జె శ్రీనివాస్ నివాసంలో బుధవారం పడిపూజ గురుస్వాములు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్రలు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్రలు చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కార్యకర్తలు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలవుతున్నాయని, ఇది జీర్ణించుకోని రెండు పార్టీల నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎస్టీయూ(సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం) సభ్యత్వ నమోదుకు ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గణపతి, యాదగిరి, జిల్లా బాధ్యులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు

అధికారులకు ఎంపీపీ స్వరూప సూచన



మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ స్వరూపరెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి వెల్దుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. విద్యుత్ ఏఈ, పీఆర్ ఏఈ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరుపై సమావేశంలో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరించడంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, తహసీల్దార్ తులసీరాం, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలతో రైతులకు చేయూత



చెక్కును అందిస్తున్న కమిటీ సభ్యులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన దీర్ఘకాలిక రుణాల(ఎల్టీ)తో చేయూత అందిస్తున్నట్లు సంఘం చైర్మన్ మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రుణాలు మంజూరైన రైతులకు చైర్మన్, కమిటీ సభ్యులు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘంలోని సభ్యులకు డీసీసీబీ మంబోజిపల్లి బ్యాంకు ద్వారా మొదటిసారి ఎల్టీ రుణాలు మంజూరు అయ్యాయని అన్నారు. వ్యవసాయ అనుబంధ రుణాలు, స్వయం ఉపాధి రుణాలను అందించేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, సీఈఓ నవీన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భూములను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, బి.శ్రీనివాస్‌గౌడ్, కె. శ్రీనివాస్‌గౌడ్, నరేశ్ అన్నారు. బుధవారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని కొంతన్‌పల్లి, గుండ్లపల్లి, సికింద్లాపూర్, శభాష్‌పల్లి, ఎదుల్లాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు భూములు, అసైన్డ్ చేసిన భూములను బీఆర్‌ఎస్ నాయకులు ఆక్రమించుకొని అమ్మకాలు చేపట్టారన్నారు. అన్యాక్రాంతం చేసిన భూములపై సమగ్ర విచారణ చేపట్టి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు.

తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న జీడీఎస్‌లు

పెద్దశంకరంపేట(మెదక్): తపాలా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పోస్టాఫీస్ కార్యాలయం వద్ద జీడీఎస్‌లు సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ డాక్ సేవకులకు 8 గంటల పని దినాలు, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని, అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. జీడీఎస్ కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసు చేసిన బంచింగ్ అమలు చేయాలని, తపాలా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మాణయ్య, గంగారం, నెహ్రూ, విజయ్, కృష్ణవేణి, ప్రశాంత్, బీరప్ప తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్

నర్సాపూర్ రూరల్: పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ సిబ్బందికి సూచించారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఆయా ప్రభుత్వ భూములతో పాటు సొంత స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే నోటీసులు ఇవ్వాలన్నారు. దీంతోపాటు ఇంటి పన్నులు, నల్ల పన్నులు వసూల్లో వేగం పెంచాలన్నారు. హరితహారం పథకంలో నాటిన చెట్లను రక్షించాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ మధుసూదన్, వార్డుల అధికారులు, పురపాలక సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం బారులు



ఈకేవైసీ కోసం వచ్చిన జనం

కౌడిపల్లి(నర్సాపూర్): గ్యాస్ సిలిండర్ కోసం ఈకేవైసీ చేయించుకోవాలని జనం బారులు తీరారు. బుధవారం కౌడిపల్లిలోని హెచ్‌పీ గ్యాస్ డీలర్ వద్ద వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు తరలి వచ్చారు. దీంతో డీలర్ వద్ద జనంతో రద్దీగా మారింది. గ్యాస్ సిలిండర్ పంపిణీ కోసం ఈకేవైసీ చేయించుకోవాలని గ్రామాల్లో ప్రచారం జరగడంతో జనం వస్తుండడంతో డీలర్ పురుషోత్తంతో పాటు సిబ్బంది లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ చేశారు.

ఉత్తమ సేవలందించిన క్రిస్టియన్లకు సత్కారం

మెదక్ కలెక్టరేట్: క్రిస్మస్ సంబరాల్లో భాగంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన క్రైస్తవులను, సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం సత్కరించనున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www tscmfc.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొనిఈనెల 13 నుంచి 15 వరకు కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 040–24491067 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతుబంధుకు దరఖాస్తులు అందించండి

చిన్నశంకరంపేట(మెదక్): కొత్తగా పట్టాదారు పాస్ బుక్ వచ్చిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తులు అందించాలని నార్సింగి వ్యవసాయ అధికారి యాదగిరి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నార్సింగి మండలంలోని రెండు క్లస్టర్‌ల పరిధిలో నూతనంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు 173 మంది ఉన్నారన్నారు.

◆ దివ్యాంగుల పోటీలో ప్రథమ బహుమతి

కౌడిపల్లి(నర్సాపూర్): దివ్యాంగుల క్రీడా పోటీల్లో మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీవాణికి ప్రథమ బహుమతి వచ్చినట్లు పీఈటీ రాజేందర్ తెలిపారు. బుధవారం మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెల్మకన్న గ్రామానికి చెందిన శ్రీవాణికి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల రన్నింగ్, క్యారమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానం వచ్చినట్లు చెప్పారు.

◆ నిందితుడికి ఏడాది జైలు

వెల్దుర్తి(తూప్రాన్) : మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులో మహిళను వేధించిన ఘటనలో నిందితుడికి ఏడాది జైలు శిక్ష పడిందని ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ పేర్కొన్నారు. 2018లో మహిళను బలవంతంగా లాగి చేయి చేసుకున్నందుకు హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మెదక్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని తెలిపారు.

◆ నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



కౌడిపల్లి(నర్సాపూర్): నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ శ్వేతకుమారి డీలర్లను హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, విత్తనాల షాపులను తనిఖీ చేశారు. స్టాక్‌బోర్డు, ఎంఆర్‌పీ ధరలకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని చెప్పారు. ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు, విత్తనాలు అమ్మాలని చెప్పారు. స్టాక్ వివరాలు రైతులకు తెలిసేలా బోర్డుపై రాయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

◆ బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులు ఎలాంటి వేధింపుల నుంచి షీటీం ద్వారా రక్షణ పొందవచ్చునని మెదక్ పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం మహిళా జూనియర్ కళాశాలలో కళాబృందం, షీటీమ్ ద్వారా విద్యార్థులకు డయల్ 100, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం పాల్గొన్నారు.

◆ నేటి నుంచి పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో ఈ నెల 14 నుంచి 17 వరకు పెద్దమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ ఉచిత వైద్య శిబిరం

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో ఎంఎస్ఆర్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ చింత స్వప్న, సర్పంచ్ సుప్రజాతో కలిసి ప్రారంభించారు. ఇందులో వైద్యులు దివ్య, శ్రావ్య, బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ దుప్పట్ల పంపిణీ



టేక్మాల్(మెదక్): మండలంలోని దనూర గ్రామంలో రాజా యూత్ అధ్యక్షుడు ఎల్లంపల్లి రాజు హీరో వెంకటేష్ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్ని, మధు, సన్నీ, పండు, గౌతమ్, శ్రీను, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.